

పులికాట్ పిలుస్తోంది!

సంక్రాంతి సంబరాలు ముగిసే వేళకి పక్షుల పండుగ మొదలవుతోంది. ఫ్లెమింగో ఫెస్టివల్‌కి వచ్చేవారికి ఈ ఏడాది పులికాట్ కనువిందు చేయనుంది. వరుస తుపానులు తెచ్చిన వానలవల్ల పులికాట్ లోకి నదులు మోసుకొచ్చిన మంచినీటికి, సముద్రపు ఉప్పునీరు ఎదురొచ్చి స్వాగతం పలికింది. ఈ సంగమంతో మత్స్యసంపద వృద్ధి చెందింది. రొయ్యలూ, చేపలూ దండిగా ఉండడంతో వలస పక్షులు కూడా పెద్ద సంఖ్యలో ఈ ఏడాది పులికాట్‌ను ఆశ్రయించాయి. ప్రస్తుతం వివిధ జాతుల పక్షులు లక్షకు పైగా పులికాట్‌లో ఉన్నట్టు పక్షుల రక్షిత కేంద్రం సిబ్బంది అంచనా వేశారు. ఆ విశేషాలు.. సచిత్రంగా..

- 6లో

రేపటి నుంచే పక్షుల పండుగ

- సూళ్లూరుపేట కేంద్రంగా ప్రారంభ, ముగింపు వేడుకలు
- నేలపట్టు, అటకానితిప్పలలో వ్యూ పాయింట్లు
- బీవీపాలెంలో పడవ షికారు.. శ్రీసిటీలో వర్క్ షాపు
- 6-7 లక్షల మంది వస్తారని అంచనా
- తిరుపతి, నెల్లూరుల నుంచీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా శనివారం నుంచి పక్షుల పండుగ జరగనుంది. వైసీపీ హయాంలో నాలుగేళ్ల పాటు ఈ వేడుకను ఆపేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులపాట జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను శనివారం ఉదయం సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ ప్రారంభించనున్నారని కలెక్టరు వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ ఏర్పాట్ల గురించి గురువారం మధ్యాహ్నం జేసీ శుభమ్ బన్సాల్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణమూర్తి తదితరులతో కలిసి కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు.


వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న కలెక్టర్

● ఐదు చోట్ల ఉత్సవాలు

సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, బీవీపాలెం, శ్రీసిటీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తారు. పక్షుల అభయారణ్యమైన నేలపట్టు, అటకానితిప్ప ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పెలికాన్ కొంగలను మరో ఏడెనిమిది జాతుల విదేశీ పక్షులను వీక్షించొచ్చు. ఇప్పుడు పెలికాన్ కొంగలు గూళ్ల ఏర్పాటు చేసుకునే సమయం కూడా. దీనికోసం ఈ రెండు ప్రాంతాల్లో వ్యూ పాయింట్లు ఏర్పాటు చేసి బైనాక్యులర్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. నేలపట్టులో అదనంగా స్నేక్ షో ఉంటుంది. అటవీశాఖ నుంచీ 50 మంది గైడ్లను నియమించారు. బీవీపాలెం పడవల రేవులో పర్యాటకులు పులికాట్ సరస్సులో షికారు చేయడానికి 35 పడవలు సిద్ధం చేశారు. ప్రతి బోటులోనూ లైఫ్ జాకెట్లు, ఇద్దరు చొప్పున గజ ఈతగాళ్లు ఉంటారు. ఈ ఐదు చోట్లా వైద్య శిబిరాలు, హెల్ప్ సెంటర్లు, భారీ బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. తిరుపతి నుంచీ పర్యాటక శాఖ ప్యాకేజీ టూర్లు నిర్వహిస్తోంది. వసతికి సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, శ్రీసిటీ ప్రాంతాల్లో హోటళ్లు అందుబాటులో ఉన్నాయి.

● శోభాయాత్ర

తొలిరోజు చెంగాలమ్మ ఆలయం నుంచీ సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. ఉత్సవాల ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు మూడు రోజులూ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలు కాలేజీ ఆవరణలో నిర్వహిస్తారు. వివిధ కళలు, హస్తకళలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. శ్రీసిటీ సెజ్‌లో మూడు రోజుల పాటు పులికాట్ పర్యావరణంపై వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచీ వివిధ కళలు, హస్తకళల ప్రదర్శనతో పాటు స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, క్రీడలు, వంటలు తదితరాలను ప్రోత్సహించడంపై అధికారులు దృష్టి సారించారు. స్థానికంగా ఆయా రంగాలకు చెందిన వారి ప్రతిభా పాటవాలను వెలుగులోకి తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

● ఐదు కేంద్రాలకూ ఇన్‌చార్జులు వీరే

నేలపట్టు- గూడూరు సబ్ కలెక్టర్, అటకానితిప్ప- డీఆర్‌డీఏ పీడీ, శ్రీసిటీ- స్టేట్ సిల్వికల్చరిస్టు, బీవీపాలెం- మత్స్య శాఖ డీడీ, సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ- డ్వామా పీడీ. ఓవరాల్ ఇన్‌చార్జిగా జేసీ శుభం బన్సాల్ ఉంటారు. ఫ్లెమింగో ఫెస్టివల్ కమిటీకి కలెక్టర్ చైర్మన్, ఎస్పీ, అటవీ శాఖ కన్సర్వేటర్ సెల్వం కో చైర్మన్లుగా వ్యవహరిస్తారు.

● ప్రత్యేక ఆకర్షణగా షార్ ఎగ్జిబిషన్

ఈసారి ఫ్లెమింగో ఫెస్టివల్‌లో షార్ ప్రధాన భాగస్వామి కానుంది. ప్రయోగించిన రాకెట్ నమూనాలతో పాటు అరుదైన యంత్రాలు, పరికరాలను విద్యార్థుల కోసం ప్రదర్శించనుంది.

● 6-7 లక్షల మంది వస్తారని అంచనా

చివరిసారి 2020 జనవరిలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజుల్లో ఐదు లక్షల మంది వీక్షించారు. నాలుగేళ్ల విరామం తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు ఆరు నుంచీ ఏడు లక్షల మంది హాజరవుతారని అధికారుల అంచనా. దీనికనుగుణంగా తాగునీరు, టాయిలెట్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు.

● ఫ్లెమింగో ఫెస్టివల్ లోగో, వెబ్‌సైట్ల ఆవిష్కరణ

ఫ్లెమింగో ఫెస్టివల్ లోగోను, వెబ్‌సైట్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్ శాశ్వతంగా ఉంటుందన్నారు. నేలపట్టు, అటకానితిప్ప, పులికాట్ సరస్సుల పర్యావరణానికి సంబంధించి ఆసక్తి వున్నవారు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకునే వీలు కల్పించామన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణంపై పనిచేసే సంస్థలతో పాటు ఆట విడుపుగా ప్రతి కుటుంబం సందర్శించాలని కోరారు.

ఎడ్ల పందేల్లో అపశ్రుతి

- ఒకరికి తీవ్ర గాయాలు.. వాహనాల ధ్వంసం



ఎద్దుల తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన పోలయ్య - దెబ్బతిన్న కారు

నాయుడుపేట టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగంగా గురువారం ఎడ్ల పరుగు పందేలు నిర్వహించారు. గతంలో ఎడ్ల పరుగు పందేలు నిర్వహించకపోవడం, ఎడ్లకు సరైన శిక్షణ లేకుండానే పందేలు ప్రారంభించడంతో కొన్ని ఎద్దులు బెదిరిపోయి జనం మీదకు వచ్చాయి. మేనకూరుకు చెందిన పేరంశెట్టి పోలయ్యను ఎద్దు తొక్కేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం పోలయ్యను నెల్లూరుకు తీసుకెళ్లారు. ఎద్దుల తొక్కిసలాటలో కారు, మోటరు సైకిళ్ల ధ్వంసమయ్యాయి.


ద్విచక్ర వాహనాలను తొక్కేస్తూ.. కిందపడిన ఎద్దు

ముక్కంటి అంతరాలయ దర్శన టికెట్ రూ.500



- నేటి నుంచి అమలు కానున్న కొత్త విధానం
- దళారులకు అడ్డుకట్ట వేసేందుకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతరాలయ దర్శనం కోసం రూ.500 టిక్కెట్లను అధికారులు ప్రవేశపెట్టారు. దళారులను అరికట్టేందుకు శుక్రవారం నుంచి అధికారులు సరికొత్త విధానానికి శ్రీకారం పలకనున్నారు. దోష నివారణ క్షేత్రంగా ఆలయం ప్రసిద్ధి చెందడంతో రాహుకేతు పూజలు జరిపించుకునేందుకు.. జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడిని దర్శించుకునేందుకు విదేశాల నుంచీ భక్తులు విచ్చేస్తున్నారు. క్షేత్రంలో స్వామి అమ్మవార్ల గర్భాలయాలు వేర్వేరుగా ఉంటాయి. అంతరాలయంలోకి వెళ్లి మూలమూర్తులను దగ్గరగా దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. అంతరాలయ దర్శనం కోసం ఇప్పటి వరకు ప్రత్యేక టిక్కెట్లను కేటాయించలేదు. ప్రముఖులు, రాజకీయ నేతలు, సిఫార్సులపై వచ్చేవారు మాత్రమే అంతరాలయ దర్శనం పొందేవారు. ప్రముఖుల ముసుగులో కొందరు దళారులు భక్తులకు అంతరాలయ దర్శనాలు చేయిస్తూ ఇష్టానుసారంగా అక్రమ సంపాదన సాగిస్తుండేవారు. గత వైసీపీ పాలనలో ఈ అంతరాలయ దర్శనం దందాగా సాగింది. అంతరాలయం దర్శనం చేసుకునేందుకు ఎలాంటి టిక్కెట్లు అందుబాటులో లేకపోవడంతో మరోమార్గం లేక చాలామంది భక్తులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇలా రోజున వెయ్యి నుంచి రెండువేల మంది వరకు అంతరాలయ దర్శనాలు చేసుకునేవారు. ఇదంతా దళారులకు డబ్బే. ఇటీవల ఈవో బాపిరెడ్డి దళారులను అరికట్టేందుకు అధికారులతో కలిసి పలుమార్లు కసరత్తు చేశారు. భక్తులతో నేరుగా మాట్లాడారు. ముఖ్యంగా అంతరాలయ దర్శనం కోసమే దళారులను భక్తులు ఆశ్రయిస్తున్నట్లు తేలింది. దీంతో అంతరాలయ దర్శనం టిక్కెట్టుపై దేవదాయశాఖకు ఈవో ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రూ.500 అంతరాలయ దర్శన టిక్కెట్టును ప్రారంభించేలా చర్యలుచేపట్టారు. మూడు కౌంటర్లలో శుక్రవారం నుంచి అవసరమైన భక్తులు ఆధార్ కార్డు చూపి అంతరాలయ దర్శనం టిక్కెట్టు కొనుగోలు చేయవచ్చు. ఈ టిక్కెట్లు కౌంటర్ నుంచి దళారుల చేతికి దారి మళ్లకుండా ఆధార్‌లింక్‌ను అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. దీంతో శుక్రవారం నుంచి భక్తులు దళారుల అవసరం లేకుండా సులభంగా దగ్గర నుంచి స్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

స్వర్ణముఖీ తీరం.. జనసంద్రం



ఏటి పండుగలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న జనం

నాయుడుపేట/టౌన్, జనవరి 16: నాయుడుపేటలోని స్వర్ణముఖినది పరివాహక ప్రాంతం జన సంద్రమైంది. రెండో రోజైన గురువారం జరిగిన ఏటి పండుగకు భారీగా జనం తరలివచ్చారు. రంగురంగుల బెలూన్లు, ఆటవస్తువులు, రంగులరాట్నాలు, జెయింట్‌వీల్, నెమలి పడవ, బెలూన్ జారుడుబల్ల తదితర ఆటవస్తువులతో చిన్నారులు సందడిగా గడిపారు. స్వర్ణముఖినదిలో జలకాలాడారు. బంధువులు, స్నేహితులు కుటుంబాలతో సహా కబడ్డీ, రింగ్‌బాల్, ఖోఖో ఆటలాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ తప్పనిసరి

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడుపుతున్నపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన గురువారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కారు నడిపే సమయంలో సీటు బెల్టు తప్పనిసరి అని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్, ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, మోహన్‌కుమార్, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి వెల్లడి



నాయుడుపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామని రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన వేలకోట్ల అప్పులతో తీవ్ర లోటు బడ్జెట్ ఉందని.. అయినప్పటికీ సీఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందంజలో ఉంచారన్నారు. గత ప్రభుత్వంలో భద్రతలేక పరిశ్రమలు ఎన్నో వెనుతిరిగాయని.. నేడు విస్తారంగా వస్తుండటంతో యువతకు ఉపాధి కలుగుతుందని చెప్పారు. 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఎన్నో భూసమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం తదితరులు పాల్గొన్నారు.

21న ఏకసభ్య కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణ జరపడానికి నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా(విశ్రాంత ఐఏఎస్) నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఈ నెల 21వ తేదీన చిత్తూరుకు రానుందని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఎస్సీ కుల సంఘ నాయకులు, ప్రజలతో సమావేశమై వారి అభిప్రాయాలను, అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాకు సంబంధించిన వారు కూడా అక్కడే వినతిపత్రాలు, అర్జీలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

జర్మన్ నర్సింగ్ లాంగ్వేజ్‌పై ఉచిత శిక్షణ

తిరుపతి(వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసిన నిరుద్యోగ యువతకు జర్మనీ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అవసరమైన జర్మన్ నర్సింగ్ లాంగ్వేజ్‌పై ఉచిత శిక్షణ తరగతులను గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి జర్మనీ భాషపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9988853335కు సంప్రదించాలని కోరారు.

పక్షుల కిలకిలలే పులికాట్ భాష!

కథనం: దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

మంచు కురిసేవేళ పక్షుల కిలకిలారావాలతో పులికాట్ కొత్త అందాలు సంతరించుకుంది. బాల భానుడి లేలేత కిరణాలతో సంగమించి పుత్తడి పులికాట్‌లా సాక్షాత్కరిస్తోంది. కదిలే పడవలు.. వలలు విసిరే జాలర్లు.. బిలబిలమంటూ వాలే వలస పక్షులు.. సుందర మనోహర దృశ్యం ఆవిష్కృతమవుతోంది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే దారికి ఇరువైపులా పక్షులు సందడి చేస్తుంటాయి. తడ సమీపంలోని బీములవారిపాళెం నుంచి ఇరకం దీవి వైపునకు పడవలో వెళ్తే ఆ అనుభూతి మరోలా ఉంటుంది. ఫ్లెమింగో పండుగకు జిల్లా సిద్ధమవుతున్న వేళ పులికాట్ సందర్శన పర్యాటకులకు ఈ ఏడాది అద్భుత ఆనందాన్ని ఇస్తుంది. పర్యాటకులకు స్వాగతం పలుకుతూ పులికాట్ అందాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఇలా వడ్డిస్తున్నారు...


ఫ్లెమింగో


గ్రేట్ ఎగ్రేట్ (పెద్ద తెల్ల కొంగ)
ఎర్రకాళ్ల కొంగల జపం
పక్షుల గణాంకంలో అటవీశాఖ సిబ్బంది


పులికాట్‌లో దొరికే అరుదైన ముక్కోలాసు చేపలు


పెలికాన్స్ (గూడబాతులు)


రెడ్ క్రెస్టెడ్ పోచ్డ్ (ఎర్ర తల చిలువ)


కామన్ కూట్ (నామాల కోడి)


పక్షులూ.. పడవలూ

ఇదీ ఈ ఏడాది పక్షుల లెక్క..

చెన్నై నుంచి వచ్చిన నిపుణులు పక్షుల పోబిడిని గమనిస్తూ లెక్కలు కడుతున్నారు. శక్తిమంతమైన బైనాకులర్లు, వీడియో కెమెరాలతో వీరు పక్షులను లెక్కకడుతున్నారు. వీరి అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటిదాకా పులికాట్‌ను ఆశ్రయించిన వలస పక్షుల వివరాలు ఇవీ...

పక్షి పేరు	వాటి సంఖ్య
గ్రేటర్ ఫ్లేమింగో(రాజహంస) :	27,153
గ్రే పెలికాన్ (గూడబాతు) :	425
పెయింటెడ్‌స్టార్క్(ఎర్రకాళ్ళ కొంగ) :	2616
లిటిల్ ఈగ్రేట్స్(చిన్న తెల్లకొంగ) :	7962
లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటికాకులు):	9862
లార్జీకార్మోరెంట్స్(పెద్ద నీటికాకులు) :	211
లార్జీఈగ్రేట్స్(తెల్ల కొంగ) :	1929
గ్రేహెరాన్(నారాయణపక్షి) :	280
పాండ్ హెరాన్(గుడ్డి కొంగ) :	595
నైట్‌హెరాన్(చింత వాఖీ) :	347
ప్రొపెల్ హెరాన్(ఎర్రనారాయణపక్షి):	16
కర్లెవ్(ఉల్లంకి పిట్ట) :	44
గ్లోస్‌సి ఐబీస్(తాటి కంకణం) :	4323
కాటిల్ ఈగ్రేట్(పశువుల కొంగ) :	6589
ఇండియన్ మూర్హెన్(తెల్లబొర్ర నీటి కోడి) :	988
యురేషియన్ కూట్(నామాల కోడి) :	4487
కామన్ కింగ్ ఫిషర్(చిన్న నీల బుచ్చిగాడు) :	176
పర్పల్ స్విమ్‌ఫెన్(సుల్తాన్ పక్షి) :	637
డాబ్ చిక్(బుడ్డకోడి) :	1086
సీగల్స్(సముద్రపు గౌరుకాకి) :	893
రెడ్ వాటిల్ లాప్వింగ్(ఎర్ర తీతువు పిట్ట) :	86
వైట్ బ్రెఆస్టెర్డ్ కింగ్ ఫిషర్(తెల్లచుక్కల నీల బుచ్చిగాడు) :	41
స్పాట్ బిల్ డక్(చుక్కమూతిబాతు) :	211
బ్లాక్ వింగ్డ్ స్టిల్(నల్ల రెక్కల ఉల్లంకి) :	2482
పైడ్ కింగ్ ఫిషర్(నీళ్ళ బుచ్చిగాడు) :	28
26. గ్రాబ్ ప్లోవర్(వాడర్ పక్షి) :	196
కామన్ టర్న్(రివ్వు పిట్ట) :	211
కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి) :	373
రివర్ టర్న్(రామదాసు) :	440
వింబ్రెల్ (పెద్ద ఉల్లంకి) :	13
ఓపెన్ బిల్ స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు) :	8165
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి) :	5556
మార్ష్ హారియర్(చిత్త నేల గద్ద) :	03
ఫాసియానాస్ టిల్డ్‌డ జాకనా(నెమలి తోక కొంగ) :	720
లెసర్ విజిలింగ్ డక్(సన్న ఈల చిలువ) :	200
రింగ్ ప్లోవర్ (పెద్ద బైతు ఉల్లంకి) :	353
బ్లాక్ టైల్డ్ గాడ్విట్(తొండు ఉల్లంకి) :	353
ప్లామ్ స్విఫ్ట్(చటక పక్షి) :	114
ఫ్లై క్యాచర్స్ (పిగిలి పిట్ట) :	96
బ్లాక్ డ్రోంగో (పసల పోలిగాడు) :	62
గ్రీన్ బీ ఈటర్స్(చిన్న పస్సిరికి) :	289
పిన్టైల్ (సూదితోక బాతు) :	2450
కెంటిష్ ప్లోవర్(చిన్నబైతు ఉల్లంకి):	98
కామన్ రెడ్డాంక్(ఎర్రకాళ్ళ ఉల్లంకి) :	129
కామన్ గ్రీన్డాంక్(పచ్చకాళ్ళ ఉల్లంకి):	268
గ్రీన్ శాండ్ పైపర్(నల్ల ఉల్లంకి) :	342
సూపన్‌బిల్(తెడ్డు మూతి కొంగ) :	122
డార్టర్(పాము మెడ బాతు) :	08
మొత్తం :	117216



సమగ్ర యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు


నెల్లుట్లవారిపల్లెలో వ్యవసాయ అధికారులు,రైతులు

భాకరాపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె, చట్టీవారిపాళెం పంచాయతీల్లో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న వేరుశనగ, జొన్న పంటలను పరిశీలించారు. ఎరువుల యాజమాన్యం, పంటలను ఆశించే తెగుళ్ల నివారణ ఉపాయాలు, నాణ్యమైన దిగుబడుల కోసం సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా మద్దినాయనిపల్లెలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల ఫైనల్స్ గురువారం జరిగాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన పోటీలను తిలకించారు. విజేత జట్టుకు రూ.9999, రన్నర్లకు రూ.7777 నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మల్లికార్జున, గోపీనాథ్‌రెడ్డి, హరీష్, రవి, మండల టీడీపీ కన్వీనర్ బోయపాటి నాగరాజనాయుడు, ప్రధాన కార్యదర్శి ఫల్గుణ, జనసేన మండల కన్వీనర్ గురునాథ్, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రామానుజపల్లెలో ఆక్రమణల తొలగింపు



తిరుపతిరూరల్, జనవరి16(ఆంధ్రజ్యోతి): రామానుజపల్లెలో (సర్వే నంబర్లు 121/5, 123/7) ప్రభుత్వ భూమిలో రాత్రికిరాత్రే ఆక్రమణదారులు నాటిన హద్దురాళ్లను గురువారం రెవెన్యూ అధికారులు తొలగించారు. సి.గొల్లపల్లె మార్గంలో 1.29 ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. రెవెన్యూ రికార్డులో ఇది బండిబాటగా ఉంది. కొందరు ఆక్రమణదారులు ఈభూమిలో ఇటీవల హద్దురాళ్లను నాటి ఆక్రమించేందుకు ప్రయత్నించారు. దీనిపై గ్రామస్తులు రూరల్ మండల తహసీల్దార్ రామాంజులనాయక్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ స్పందించి స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణను తొలగించాలని వీఆర్వో మురళిని ఆదేశించారు. గురువారం హద్దురాళ్లను తొలగించారు.

శాస్త్రోక్తంగా కల్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం


ఉత్సవంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుపతిరూరల్, జనవరి16(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వెంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవాన్ని గురువారం నిర్వహించారు. కృష్ణస్వామిని సన్నిధి యాదవ పూజచేసిన చోటుకు తీసుకెళ్లి పాలు, వెన్న, హారతులు సమర్పించారు. మలయప్పస్వామి వారు కొంతదూరం పరుగెత్తగా..ఆయన తరఫున అర్చకులు బాణం వేసిన తర్వాత వెనక్కి వచ్చారు. తిరిగి ప్రధానాలయం వద్దకు ఉత్సవమూర్తులను తీసుకురావడంతో ఉత్సవం ముగిసింది. ఆలయ వ్యవస్థాపకఅధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదంపతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రగిరి



ముక్కంటి సేవలో విశ్రాంత డీజీపీ

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం రాష్ట్ర విశ్రాంత డీజీపీ ఆర్‌పీ ఠాగూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు.

గుండెపోటుతో ఎమ్మెల్యే కురుగొండ్ల సోదరుడి మృతి


కురుగొండ్ల శేఖర్ (ఫైల్ ఫొటో)

డక్కిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోదరుడు కురుగొండ్ల శేఖర్ (53) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గుంటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా స్థిరపడ్డ శేఖర్ ఇంటి వద్ద రాత్రి భోజనం చేశాక ఛాతీలో నొప్పితో కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస వదిలారు. దీంతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంటనే గుంటూరుకు వెళ్లారు. శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శేఖర్ స్వగ్రామమైన డక్కిలి మండలం కమ్మవారిపల్లిలో శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు.

నేటి నుంచి క్యాన్సర్ పరీక్షలు

నారాయణవనం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నారాయణవనం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నుంచి ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ దర్శిత్ రాజ్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం తుంబూరు, పాలమంగళం, 20న అరణ్యంకండ్రిగ, కీళగరం, 21న కాశిమిట్ట, వెంకటకృష్ణపాలెం, 23న భీమునిచెరువు, నారాయణవనం-3, 24న ఎరికంబట్టులో జరుగుతాయని ఆయన వివరించారు.

కనులపండువగా ఎల్లమ్మ కొండచుట్టు తిరునాళ్ళు



ఎల్లమ్మ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని- అమ్మవారి ఊరేగింపులో వీపునకు కొక్కెం తగిలించుకుని వేలాడుతున్న భక్తుడు

చంద్రగిరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి కొండచుట్టు తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కి అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని ఆలయ ముఖ మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి అశ్వవాహనంపై అధిష్ఠించారు. చంద్రగిరి మిట్టమీద గంగమ్మ, కోటలోని ముత్యాలమ్మ, చంద్రగిరి కొత్తపేటలోని అంకాలమ్మ, రాయలపురం మాతమ్మ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, వివిధ రకాల డప్పుల వాయిద్యాలు, కీలు గుర్రాలు, మైసూర్ బ్యాండ్స్, కోలాటాలు, చెక్కభజనలు, పిళ్ళంగట్లు, ఆటలతో అమ్మవార్ల ఊరేగింపు ప్రారంభమైంది. ఉత్సవాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హజరయ్యారు. అగరాల, కుప్పిరెడ్డిగారిపల్లె, పుల్లయ్యగారిపల్లె, పాండురంగయ్యగారిపల్లి. ఐతేపల్లి. కొటాల, నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లె మీదుగా శుక్రవారం తెల్లవారుజామున ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుంది. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా అమ్మవారికి టీటీడీ తరపున ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, కమిటీ సభ్యులు వెంకటముని, నాగరాజ, స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించాక ఆయన ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి దర్శించుకున్నారు.

శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించాలి

● కుంభమేళాలో టీటీడీ ఏర్పాట్లపై ఈవో సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో శ్రీవారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలపై గురువారం ఆయన పరిపాలన భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఈనెల 18, 26, ఫిబ్రవరి 3, 12 తేదీల్లో కల్యాణోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఉత్తరాది భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశముందన్నారు. ఈనెల 29న మౌని అమావాస్య, ఫిబ్రవరి3న మాఘపౌర్ణమి, 26న శివరాత్రి వంటి ప్రధాన రోజుల్లో రద్దీ అధికంగా ఉండే క్రమంలో విజిలెన్స్ అధికారులు, ప్రయాగ్‌రాజ్ పోలీసుల సమన్వయంతో క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉచితంగా ఇచ్చే చిన్న లడ్డూలను సమకూర్చుకోవాలన్నారు. శ్రీవారికి రోజువారి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు జరుగుతున్న సేవలను అధికారులు ఆయనకు వివరించారు. నమూనా ఆలయానికి భక్తులు ఎంతమంది వస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నారనే వివరాలను ఈవో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, హెచ్‌డీపీపీ అదనపు సెక్రటరీ పీవీ రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హర్షిత్‌రెడ్డికి అభినందన

తిరుపతి రూరల్, జనవరి16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని ఆపార్టీకి చెందిన యువజన, విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి నేతృత్వంలో పలువురు విద్యార్థి నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువా, పుష్పమాలతో సత్కరించి అభినందించారు. కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంగల్‌రెడ్డి, ప్రదీప్, భూపాల్, కిరణ్, నవీన్‌కుమార్‌రెడ్డి, పార్థసారథి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గుర్రప్పస్వామి ఊరేగింపు



రామచంద్రాపురరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కమ్మకండ్రిగలో గురువారం రాత్రి గుర్రప్పస్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఏటా గ్రామంలో నాలుగు రోజుల పాటు గ్రామదేవతలను ఊరేగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలో గుర్రప్పస్వామి మూలమూర్తికి తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పుష్పపల్లకి లో ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గిరి ప్రదక్షిణకు తరలిన దేవతామూర్తులు


పుర వీధులలో ఊరేగుతున్న మరకతవల్లి సమేత అగస్తీశ్వరస్వామి, చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి

నారాయణవనం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గురువారం నగరిలో కొండచుట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి మండలంలోని శివాలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసువెళ్లారు. నారాయణ వనంలోని చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి, సముదాయం గ్రామంలోని మరకతవల్లి సమేత అగస్తీశ్వరస్వామి, తుంబూరులోని తుంబీశ్వరస్వామిని, పాలమంగళం పాలేశ్వరస్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి నగరిలో జరిగే కొండచుట్టు ఉత్సవంలో పాల్గొన్నాయి.



దోర్నకంబాలలో పరుగు తీస్తున్న కోడెగిత్తలు..అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

గ్రామాల్లో జల్లికట్టు సందడి

చంద్రగిరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం పశువుల పండగను ఘనంగా నిర్వహించారు. మల్లయ్యపల్లె, దోర్నకంబాల, మండపంపల్లె గ్రామాల్లో ఈ సందర్భంగా నిర్వహించిన జట్టికట్టు తిరునాళ్ళను తలపించింది. తొలుత రంగు కాగితాలు అంటించిన చెక్కపలకను కోడెగిత్తల కొమ్ములకు అలంకరించారు. తరువాత వీధుల్లో అల్లివైపు పశువులను విడిచిపెట్టారు. అవి పరుగులెత్తుతుంటే నిలువరించి చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ ప్రయత్నంలో కొంతమందికి గాయాలయ్యాయి. జల్లికట్టును తిలకించడానికి ఆయా గ్రామాలకు వేలాది మంది జనం తరలివచ్చారు. దీంతో అనుప్పల్లి-చంద్రగిరి మార్గంలో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడకుండా సీఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలు వివాదాలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి.

ఇస్రో విజయంపై శ్రీసిటీ అభినందనలు

శ్రీసిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సాధించిన డాకింగ్ స్పేస్ డాకింగ్ ప్రయోగం విజయ వంతం కావడం పట్ల ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ.నారాయణన్‌కు, ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఉప గ్రహాల అనుసంధానం (డాకింగ్) చేయగల సత్తా కలిగిన 4వ దేశంగా భారత్ నిలిచిందని పేర్కొంటూ ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషి, అంకితభావాన్ని కొనియాడారు. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నారాయణన్‌కు అభినందనలు తెలిపిన రవీంద్ర సన్నారెడ్డి అంతరిక్ష పరిశోధనల పురోగతిలో భారతీయ శాస్త్రవేత్తల అసాధారణ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ స్పేస్ డాకింగ్‌లో ఇస్రో సాధించిన విజయం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఇస్రో అంకితభావాన్ని ప్రశంసిస్తూ వారి విజయ పరంపర నిరంతరం కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు.

22న క్యాంపస్ సెలక్షన్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం ఐటీఐ(ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో ఈనెల 22న క్యాంపస్ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మి గురువారం తెలిపారు. అమరరాజ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వారు పాల్గొంటారని, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఐటీఐ, అప్రెంటిస్, ఆధార్‌కార్డులు, రెండు ఫొటోలతో ఉదయం 10 గంటలకు రావాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9550722922ను సంప్రదించాలని కోరారు.

సమన్వయంతో మెరుగైన సేవలు

డీపీటీవోకు ఈయూ ఘన సన్మానం


డీపీటీవోకు అభినందనలు తెలుపుతున్న ఈయూ నేతలు

తిరుపతి(ఆర్టీసీ),జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని డీపీటీవో జి.నరసింహులు కోరారు. ఎంప్లాయిస్ యూనియన్ నేతలు గురువారం మధ్యాహ్నం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ప్రయాణికులకు సేవలందించడానికి తాము ముందుంటామని, సంస్థ అభివృద్ధికి సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తే డ్యూటీలో ఒత్తిడి లేకుండా పనిచేస్తారని తెలపగా అందుకు డీపీటీవో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్ యాదవ్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు దళవాయి గురునాథం, తాండాయం సత్యనారాయణ, వి.మస్తాన్, జి.ఆర్.చంద్ర, బి.సుబ్రహ్మణ్యం, కె.రఘు, ఎన్.ఎస్.మణ్యం, జొన్న సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గతనెలలో మృతిచెందిన నంద్యాలకు చెందిన హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ కుటుంబానికి గురువారం ఆర్థిక సాయం అందించారు. మూడు రోజుల పోలీసు శిక్షణ నిమిత్తం గతనెలలో మధుసూదన్ తిరుపతికి వచ్చాడు. శిక్షణ ముగించుకుని నంద్యాలకు వెళ్లడానికి 20వ తేదీన తిరుపతి ఆర్టీసీ బస్టాండుకు వచ్చాడు. బస్సు ఎక్కే క్రమంలో కాలు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ పోలీసు శాలరీ కింద దరఖాస్తు చేయించారు. పోలీసు అధికారుల యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర రెడ్డి కృషి మేరకు ఆ కుటుంబానికి గురువారం రూ.75 లక్షలు అందజేశారు.

ఖాతాదారుల సేవలకు ప్రాధాన్యం


భువన్ కుమార్

తిరుపతి(ఆటోనగర్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఖాతాదారులకు సత్వర సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే గూడూరు బ్రాంచి మేనేజర్‌గా ఉన్న భువన్ కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశామని బ్యాంక్ రీజనల్ మేనేజరు సంజయ్ కుమార్ ఝా తెలిపారు. భువన్ కుమార్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదే సమయంలో ఖాతాదారులకు త్వరితగతిన సేవలందించడానికి కృషి చేస్తానని తెలిపారు.

చిగురువాడలో వైభవంగా గ్రామోత్సవం


గ్రామంలో ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ గ్రామంలో ముక్కనుమను పురస్కరించుకుని ముత్యాలమ్మతల్లి గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారు సింహ వాహనంపై కొలువుదీరి గ్రామంలో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులు కర్పూర హారతులు, కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదాలకు దారితీస్తుంది

ఆర్టీసీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాసరావు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. తిరుపతి, అలిపిరి డిపోల్లో గురువారం రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాసరావు, డీపీటీవో నరసింహులు, ట్రాఫిక్ సీఐ హరి, ఏవీఎస్వో రాజశేఖర్, వీఐ పురుషోత్తం మాట్లాడుతూ సమస్యలు, ఒత్తిడిని పక్కన పెట్టి ప్రశాంత మనస్సుతో విధులకు హాజరుకావాలని డ్రైవర్లకు సూచించారు. సెల్‌ఫోన్, బ్లూటూత్, ఇయర్‌బడ్స్‌ను పక్కన పెట్టాలన్నారు. వెనుక, ముందు వాహనాలను, ద్విచక్ర వాహనాలు, రోడ్డుదాటే పాదచారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రమాద రహిత రవాణా అందిస్తామని డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. డీఎంలు బాలాజీ, రామచంద్రనాయుడు, చల్లా చంద్రయ్య, చాందిని, అలిపిరి డిపో హరిబాబు, ప్రభాకర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల నిరసన


నిరసన తెలుపుతున్న దుకాణ నిర్వాహకులు

తిరుపతి అర్బన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గాంధీ రోడ్డులో ఏళ్ల తరబడి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దుకాణాలను తొలగించవద్దని నిర్వాహకులు గురువారం హాథీరాంజీమఠం ఎదుట నిరసన చేపట్టారు. దుకాణాలు ఖాళీ చేయాలని మఠం అధికారులు, పోలీసులు హెచ్చరించడంతో కార్పొరేటర్ నరసింహాచారి ఆధ్వర్యంలో వారు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 300 మంది హాథీరాంజీమఠం దుకాణాలను లీజుకు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతుండడంతో మరమ్మతులు చేయాలని పలుమార్లు కోరినా స్పందించలేదన్నారు. ఈ క్రమంలో దుకాణదారులే సొంత వ్యయంతో మరమ్మతులు చేసుకున్నారన్నారు. మరమ్మతులు పూర్తయ్యాక ఖాళీ చేయమని చెప్పడం భావ్యం కాదన్నారు. ఈ ప్రతిపాదన వెనక్కు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దుకాణదారులు కుమార్, శీను, ఆలీ, కోదండ, దుర్గ, చిన్ని, సాదిక్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్, రూరల్ విద్యుత్ డివిజన్ల పరిధిలో వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలని ఈఈలు చంద్రశేఖరరావు, వాసురెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈనెల 18వ తేదీలోపు అపరాధ రుసుం లేకుండా చెల్లించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అత్యాధునిక ఆస్పత్రి

● త్వరలో ప్రారంభం


తుదిదశ పనులు కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల నూతన ఆస్పత్రి భవనం

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు అత్యాధునిక ఆస్పత్రి అతిత్వరలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం తుదిదశపనులు జరుగుతుండగా ఫిబ్రవరిలో ప్రారంభించడానికి జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. సుదీర్ఘకాలం తరువాత ఆర్టీసీ ఉద్యోగులకు ఇదొక శుభవార్త. ఇప్పటి వరకు సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ఆవరణలోని గ్యారేజీకి అనుసంధానంగా ఆస్పత్రి ఉంది. ఇందులో స్థలాభావం, సౌకర్యాల కొరత, భవనం పాతబడి ఉరుస్తుండడం, గాలి వెలుతురు సరిగా లేకపోవడం వంటి సమస్యలున్నాయి. మెట్లు అధికంగా, నిలువుగా ఉండడంతో దివ్యాంగులు, ఆరోగ్యం బాగోలేనివారు, విశ్రాంత ఉద్యోగులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి అలిపిరి రోడ్డులోని ఆర్టీసీ డ్రైవర్స్ క్వార్టర్స్ వద్ద విశాలమైన స్థలంలో ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.1.92 కోట్లు కేటాయించారు. గతేడాది జనవరిలో భూమిపూజ చేశారు. పనులు శరవేగంగా జరిపి రెండు అంతస్తుల భవనం నిర్మాణం పూర్తయింది. భూమట్టంలో వాహనాల పార్కింగ్, తొలి అంతస్తులో ఆడ, మగ వైద్యులకు వేర్వేరుగా ఛాంబర్స్, మందులు నిల్వగది, ఆపరేషన్ థియేటర్, వెయిటింగ్ హాలు, ల్యాబ్, ఆస్పత్రికి వచ్చే మహిళ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు, డాక్టర్స్ నర్సులకు వేర్వేరుగా టాయిలెట్స్, లిఫ్ట్ సౌకర్యం వంటి అధునాతన సదుపాయాలు కల్పించారు.

రూ.4 కోట్లతో రెండు, మూడు అంతస్తులు

ఆన్‌డ్యూటీలో భాగంగా ఆస్పత్రి వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిల సౌకర్యార్థం విశ్రాంతి కోసం రెండో అంతస్తులో ఆరుగదులు, ఆర్టీసీకి సంబంధించిన ముఖ్యమైన అధికారులు తిరుపతి పర్యటనకు వచ్చినప్పుడు బసచేసేందుకు మూడో అంతస్తులో విశ్రాంతి గదులను నిర్మించనున్నారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభంకానున్నాయి. దీనికి మరో రూ.4 కోట్లు కేటాయించారు.

రెండు నెలల క్రితం బదిలీలు.. ఇప్పుడు డిప్యుటేషన్లు

ఒకే కళాశాల నుంచి 18మంది అధ్యాపకులకు డిప్యుటేషన్లు

తిరుపతిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని గరివిడి వెటర్నరీ కళాశాలలో పనిచేసే 18 మంది అధ్యాపకులకు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్ కింద తాత్కాలిక డిప్యుటేషన్లు చేపడుతూ గురువారం వెటర్నరీ సైన్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య పేరిట ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో డిప్యుటేషన్ల కాలవ్యవధిని పొందుపరచకుండా తదుపరి ఆర్డర్స్ వచ్చే వరకు ఈ డిప్యుటేషన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కాగా అదే కళాశాలకు గతేడాది నవంబరు 8న వర్సిటీ పరిధిలోని పలు కళాశాలలు, పరిశోధన స్థానాలకు చెందిన పలువురు అధ్యాపకులకు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్‌కింద బదిలీలు చేపట్టారు. తిరిగి రెండు నెలల కాలవ్యవధిలోనే అదే స్టేషన్ నుంచి ఏకకాలంలో ఎక్కువ సంఖ్యలో (13మంది ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్) అధ్యాపకులను డిప్యుటేషన్ల రూపంలో బదిలీలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గరివిడిలోని కళాశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కోసం గతేడాది నవంబరులో వీసీఐ ప్రతినిధుల బృంద సభ్యులు ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

13 మోటారు సైకిళ్ల స్వాధీనం


నిందితుడు, మోటారు సైకిళ్లతో పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడప, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో మోటారు సైకిళ్ల చోరీ చేసే నిందితుడిని తిరుపతి వెస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.15 లక్షల విలువైన 13 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ మురళీమోహన్‌రావు వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం గ్రామానికి చెందిన పఠాన్ సాహిద్ బాషా, పఠాన్ ఇమ్రాన్ సులభ సంపాదనకు అలవాటు పడ్డారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని వెస్ట్, ఈస్ట్, అలిపిరి, రేణిగుంట, కడప జిల్లా రైల్వే కోడూరు, ఓబులవారిపల్లి, ప్రొద్దుటూరు స్టేషన్ల పరిధిలో మోటారు సైకిళ్ల చోరీ చేసి, బయట ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వెస్ట్ సీఐ మురళీమోహన్ సిబ్బందితో కలసి గురువారం వివేకానంద సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన పఠాన్ సాహిద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. అతనితో ఉన్న పఠాన్ ఇమ్రాన్ పరారయ్యాడు. పఠాన్ సాహిద్ ఇచ్చిన సమాచారం మేరకు 13 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ సురేంద్ర, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు గోపినాథ్, రమేష్‌లను డీఎస్పీ వెంకటనారాయణ అభినందించారు.

పెరిగిన రద్దీ

తిరుమలలో ఉత్తరద్వార దర్శనం కొనసాగుతోంది. 10న వైకుంఠ ఏకాదశితో మొదలైన ద్వార దర్శనాలు 19తో ముగుస్తాయి. చివరి రోజుల్లో భక్తుల రద్దీ కూడా పెరిగింది.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.2.95 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 71,417
తలనీలాలు సమర్పించినవారు : 19,396

శ్రీవారిసేవలో ప్రముఖులు


ఆలయం ముందు కమిటీ సభ్యులు - దిలీప్

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. పార్లమెంటరీ రూరల్ డెవలెప్‌మెంట్ కమిటీ చైర్మన్ సప్తగిరి శంకర్ ఉలక ఆధ్వర్యంలో సభ్యులు ఉన్నారు. అలాగే భారత క్రికెట్ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ కూడా స్వామి దర్శనం చేసుకున్నారు.

కేశవాయనగుంటలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కేశవాయనగుంటలో గురువారం దొంగలు పడ్డారు. ఇంట్లోని బంగారు, వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. కేశవాయనగుంటలో నివాసం ఉంటున్న విజయలక్ష్మి ఇటీవల ఊరెళ్లారు. ఆమె ఊరునుంచి వచ్చే లోగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటిలోని వస్తువులు పరిశీలించగా బీరువాలో భద్రపరచి వెళ్ళిన దాదాపు 40 గ్రాముల బంగారు నగలు, 200 గ్రాముల వెండి వస్తువులు కనపడలేదు. దీనిపై ఆమె ఈస్ట్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కొండచుట్టుకు హాజరైన జనసందోహం

నగరి,జనవరి 16 (ఆంధ్రజ్యోతి):ఏటా ముక్కనుమ పండుగరోజు నిర్వహించే కొండచుట్టు ఉత్సవం ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జరిగింది.ఉత్సవాలకు కేంద్రమైన నగరి కొండచుట్టు మండపం వద్ద గురువారం ఉదయం నుంచే తిరునాళ్ల వాతావరణం నెలకొంది.మండపం పరిసర ప్రాంతాలలో తినుబండారాలు, బొమ్మలు, గాజులు, చెరకుగడలు, అలంకరణ వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి.సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రజలు కొండచుట్టు మండపం వద్దకు భారీగా తరలిరావడంతో కొండచుట్టుకు వెళ్లే మార్గంతో పాటు తిరుపతికి వెళ్లే రోడ్డుపై రద్దీ నెలకొంది.విద్యుద్దీపాలతో, బెలూన్లతో కొండచుట్టు మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.మండపం వద్ద గల వినాయకస్వామిని దర్శించుకోవడానికి జనం క్యూలైన్లలో బారులు తీరారు.ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలకు విచ్చేసిన దేవతామూర్తులకు నగరి కరకంఠేశ్వరస్వామి స్వాగతం పలికారు.ట్రాక్టర్లలో అందమైనప్రభలతో అలంకారపూరితమై విచ్చేసిన 21 గ్రామ దేవతలు మండపం ఆవరణలోని మైదానానికి చేరగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.మాజీమంత్రి ఆర్కే రోజా, మాజీ మున్సిపల్ చైర్మన్లు కేజే శాంతి, కేజే కుమార్ తదితరులు మొక్కులు తీర్చుకున్న వారిలో వున్నారు.

పొట్టేలును బలిచ్చిన ఐదుగురిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డాకు మహారాజు సినిమా రిలీజ్ సందర్భంగా పొట్టేలును బలిచ్చిన ఐదుగురు బాలకృష్ణ అభిమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. బాలకృష్ణ హీరోగా నటించిన డాకూ మహారాజ్ సినిమా విడుదల సందర్భంగా ఆయన అభిమానులు రామచంద్రాపురం మండలం మచ్చా రెడ్డిపల్లికి చెందిన శంకరయ్య, కొర్లగుంటకు చెందిన రమేష్, చింతామణికి చెందిన సురేష్ రెడ్డి, బాంగారుపాళ్యంకు చెందిన ప్రసాద్, తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు చెందిన లోకేష్ స్థానిక ప్రతాప్ థియేటర్ ముందు ఈనెల 12న పొట్టేలును బలిచ్చి ఆ రక్తం సినిమా పోస్టర్‌కు అంటించారు. పోస్టర్ మొత్తం రక్తంతో నిండిపోవడంతో స్థానికులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ నిందితుల కోసం గాలిస్తున్నారు.

సీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ


ఏడుకొండల బస్టాండులో ప్రయాణికుల రద్దీ

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలు ముగియడంతో ప్రజలు నగరబాట పట్టారు. ప్రయాణికుల రాకతో ఉదయం నుంచి రాత్రి వరకు సెంట్రల్ బస్టాండులో రద్దీ నెలకొంది. మరో వైపు తిరుమలకు వెళ్లే భక్తులు కూడా పెరగడంతో ఏడు కొండల బస్టాండు కిటకిటలాడింది. కౌంటర్ వద్ద ప్రయాణికులు బారులుతీరారు. రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది తప్పలేదు. సంక్రాంతికి సెలవు తీసుకున్న డ్రైవర్లు, కండక్టర్లు సకాలంలో డ్యూటీకి రాకపోవడంతో కొన్ని బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. బస్సులు సకాలలో రాకపోవడంతో లగేజీ బ్యాగులు, చంటిబిడ్డలతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

కదలిక లేని క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

● స్థలం చదును చేసి వదిలేశారు
● బసలేక భక్తుల ఇబ్బంది


క్యూకాంప్లెక్సు నిర్మాణం కోసం చదును చేసిన స్థలం

తిరుచానూరు,జనవరి16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి భక్తులు బసలేక ఇబ్బంది పడుతున్నారు. పదేళ్ల క్రితం అమ్మవారి దర్శనానికి నిత్యం పదివేల మంది వచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 20 నుంచి 30వేల వరకు పెరిగింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల బస కోసం తిరుచానూరు సమీపంలో సుమారు అత్యాధునిక హంగులతో పద్మావతి నిలయం నిర్మించారు. వెంటనే కరోనా రావడంతో ఇది రోగులకు విడిదికేంద్రంగా మారిపోయింది. ఆ తరువాత గత జగన్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా కలెక్టరేట్‌కు కేటాయించింది. భక్తుల్లో తమిళనాడు భక్తులే ఎక్కువ. వారు మొదట తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ఒక రోజు బస చేస్తారు. మర్నాడు శ్రీవారి దర్శనానికి వెళ్తుంటారు. ప్రస్తుతం తిరుచానూరులో భక్తుల బసకు టీటీడీ ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో తరచూ భక్తులు రాత్రి వేళ ఆలయం వద్ద, రోడ్లపై పడుకుంటున్నారు. ఇదే అదనుగా స్థానికంగా ఉన్న కొన్ని చిన్నపాటి లాడ్జిలు అధిక మొత్తంలో భక్తుల నుంచి వసూలు చేస్తున్నారు.

కాగితాలకే పరిమితమా

గత టీటీడీ పాలకమండలి తిరుచానూరులో అత్యాధునిక హంగులతో తిరుమల తరహాలో రూ.24కోట్లతో క్యూకాంప్లెక్సు నిర్మించాలని నిర్ణయించింది. నిధులు కూడా విడుదల చేసింది. గత ఎన్నికల సమయంలో ఇందు కోసం గేట్ నెంబరు 4వద్ద (పాతపోలీస్‌స్టేషన్) టీటీడీ పాత కల్యాణ మండపాల సముదాయాన్ని కూల్చివేసి పూర్తిగా చదును చేశారు. తరువాత పునాది పనులను కూడా ప్రారంభించలేదు. టీటీడీ అధికారులు స్పందించి వసతి, బస చేయడానికి క్యూకాంప్లెక్సు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.



పక్షుల కిలకిలలే పులికాట్ భాష!

మంచు కురిసేవేళ పక్షుల కిలకిలారావాలతో పులికాట్ కొత్త అందాలు సంతరించుకుంది. బాల భానుడి లేలేత కిరణాలతో సంగమించి పుత్తడి పులికాట్‌లా సాక్షాత్కరిస్తోంది. కదిలే పడవలు.. వలలు విసిరే జాలర్లు.. బిలబిలమంటూ వాలే వలస పక్షులు.. సుందర మనోహర దృశ్యం ఆవిష్కృతమవుతోంది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే దారికి ఇరువైపులా పక్షులు సందడి చేస్తుంటాయి. తడ సమీపంలోని బీములవారిపాళెం నుంచి ఇరకం దీవి వైపునకు పడవలో వెళ్తే ఆ అనుభూతి మరోలా ఉంటుంది. ఫ్లెమింగో పండుగకు జిల్లా సిద్ధమవుతున్న వేళ పులికాట్ సందర్శన పర్యాటకులకు ఈ ఏడాది అద్భుత ఆనందాన్ని ఇస్తుంది. పర్యాటకులకు స్వాగతం పలుకుతూ పులికాట్ అందాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ ఇలా వడ్డిస్తున్నారు...

కథనం: దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

ఫ్లెమింగో

గ్రేట్ ఎగ్రేట్ (పెద్ద తెల్ల కొంగ)

ఎర్రకాళ్ల కొంగల జపం

పక్షుల గణాంకంలో అటవీశాఖ సిబ్బంది



పులికాట్‌లో దొరికే అరుదైన ముక్కోలాసు చేపలు



పెలికాన్స్ (గూడబాతులు)



రెడ్ క్రెస్టెడ్ పోచ్ఛ్ (ఎర్ర తల చిలువ)



కామన్ కూట్ (నామాల కోడి)



పక్షులూ.. పడవలూ

ఇదీ ఈ ఏడాది పక్షుల లెక్క..

చెన్నై నుంచి వచ్చిన నిపుణులు పక్షుల పోబిడిని గమనిస్తూ లెక్కలు కడుతున్నారు. శక్తిమంతమైన బైనాకులర్లు, వీడియో కెమెరాలతో వీరు పక్షులను లెక్కకడుతున్నారు. వీరి అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటిదాకా పులికాట్‌ను ఆశ్రయించిన వలస పక్షుల వివరాలు ఇవీ...

పక్షి పేరు	వాటి సంఖ్య								
గ్రేటర్ ఫ్లెమింగో(రాజహంస) :	27,153	నైట్‌హెరాన్(చింత వాఖి) :	347	సీగల్స్(సముద్రపు గౌరుకాకి) :	893	వింబ్రెల్ (పెద్ద ఉల్లంకి) :	13	బ్లాక్ డ్రోంగో (పసల పోలిగాడ్లు) :	62
గ్రే పెలికాన్ (గూడబాతు) :	425	ప్రొపెల్ హెరాన్(ఎర్రనారాయణపక్షి):	16	రెడ్ వాటిల్ లాప్వింగ్(ఎర్ర తీతువు పిట్ట) :	86	ఓపన్ బిల్ స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు) :	8165	గ్రీన్ బీ ఈటర్స్(చిన్న పస్సిరికి) :	289
ఫెయింటెడ్‌స్టార్క్స్(ఎర్రకాళ్ళ కొంగ) :	2616	కర్లెవ్(ఉల్లంకి పిట్ట) :	44	వైట్ బ్రెఅస్టెడ్ కింగ్ ఫిషర్(తెల్లచుక్కల నీల బుచ్చిగాడు) :	41	వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి) :	5556	పిన్టెల్ (సూదితోక బాతు) :	2450
లిటిల్ ఈగ్రేట్స్(చిన్న తెల్లకొంగ) :	7962	గ్లోస్సి ఐబీస్(తాటి కంకణం) :	4323	స్పాట్ బిల్ డక్(చుక్కమూతిబాతు) :	211	మార్ష్ హారియర్(చిత్త నేల గద్ద) :	03	కెంటిష్ ప్లోవర్(చిన్న బైతు ఉల్లంకి):	98
లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటికాకులు):	9862	కాటిల్ ఈగ్రేట్(పశువుల కొంగ) :	6589	బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్(నల్ల రెక్కల ఉల్లంకి) :	2482	ఫాసియానాస్ టిల్డ్‌డ జాకనా(నెమలి తోక కొంగ) :	720	కామన్ రెడ్డాంక్(ఎర్రకాళ్ళ ఉల్లంకి) :	129
లార్జీకార్మోరెంట్స్(పెద్ద నీటికాకులు) :	211	ఇండియన్ మూర్హెన్(తెల్లబొర్ర నీటి కోడి) :	988	పైడ్ కింగ్ ఫిషర్(నీళ్ళ బుచ్చిగాడు) :	28	లెసర్ విజిలింగ్ డక్(సన్న ఈల చిలువ) :	200	కామన్ గ్రీన్డాంక్(పచ్చకాళ్ళ ఉల్లంకి):	268
లార్జీఈగ్రేట్స్(తెల్ల కొంగ) :	1929	యురేషియన్ కూట్(నామాల కోడి) :	4487	26. గ్రాబ్ ప్లోవర్(వాడర్ పక్షి) :	196	రింగ్ ప్లోవర్ (పెద్ద బైతు ఉల్లంకి) :	353	గ్రీన్ శాండ్ పైపర్(నల్ల ఉల్లంకి) :	342
గ్రేహెరాన్(నారాయణపక్షి) :	280	కామన్ కింగ్ ఫిషర్(చిన్న నీల బుచ్చిగాడు) :	176	కామన్ టర్న్(రివ్వు పిట్ట) :	211	బ్లాక్ టైల్డ్ గాడ్విట్(తొండు ఉల్లంకి) :	353	సూపన్‌బిల్(తెడ్డు మూతి కొంగ) :	122
పాండ్ హెరాన్(గుడ్డి కొంగ) :	595	పర్పల్ స్విమ్‌ఫెన్(సుల్తాన్ పక్షి) :	637	కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి) :	373	ప్లామ్ స్విఫ్ట్స్(చటక పక్షి) :	114	డార్టర్(పాము మెడ బాతు) :	08
		డాబ్ చిక్(బుడ్డకోడి) :	1086	రివర్ టర్న్(రామదాసు) :	440	ఫ్లై క్యాచర్స్ (పిగిలి పిట్ట) :	96	మొత్తం :	117216



మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

నాయుడుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి గురువారం మీడియా సమావేశం నిర్వహించిన క్రీడా, రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని పలువురు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు మధురెడ్డి, నెలవల రాజేష్, చంద్రారెడ్డి, సంచి కృష్ణయ్య, రమేష్ నాయుడు, అవధానం సుధీర్, నానా బాల సుబ్బారావు, జీవీఆర్ నాయుడు, మస్తాన్ తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

పెళ్లకూరు: రేణిగుంట విమానాశ్రయం నుంచి నాయుడుపేటలోని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నివాసానికి వెళ్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని తాళ్వాయిపాడు వద్ద పెళ్లకూరు మండల టీడీపీ నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ నాయుడు, నాయకులు పేరం రమేష్ నాయుడు, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరులో కలపాలంటూ సీఎంకు లేఖ

కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలంటూ సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు గురువారం హైదరాబాదు నుంచి స్థానిక విలేకర్లకు తెలిపారు. నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం తిరుపతి జిల్లాలో విలీనం చేసిందన్నారు. దీనివలన గూడూరుతోపాటు చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి తిరుపతి చేరుకోవాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌లు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీని నెరవేర్చాలని లేఖలో కోరినట్లు కోటేశ్వరరావు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



జయంపు పాఠశాల పూర్వ విద్యార్థులు

బాలాయపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు ఉన్నత పాఠశాలలో 1983 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు గురువారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సంతోషంగా గడిపారు. జయంపు కృష్ణ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.35వేలు విలువైన మైక్‌సెట్‌ను హెచ్‌ఎం రమణయ్యకు అందజేశారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వీర్లయ్యస్వామి ఉత్సవాలు



వీర్లయ్యస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీమంత్రి పరసా రత్నం

పెళ్లకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని శిరసనంబేడు, రోసనూరు, తాళ్వాయిపాడు గ్రామాల్లోని సిద్ధేశ్వర స్వామి, భూపతేశ్వరస్వామి, వీర్లయ్యస్వామి ఉత్సవాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం తాళ్వాయిపాడు గ్రామంలో నిర్వహించిన వీర్లయ్యస్వామి ఉత్సవాల్లో మాజీమంత్రి డాక్టర్ పరసారత్నం, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ భర్త పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ఓజిలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాళెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్కే ఖలీల్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కీర్తిపాటి అర్జున్‌రాజు, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రవీంద్రరాజుల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్ఐ స్వప్నలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎం.భాగ్యలక్ష్మి, ద్వితీయ బహుమతి వై.సుజాత, తృతీయ బహుమతి పి.కిష్కింద దక్కించుకున్నారు. సర్పంచు శారద, ఏపీవో ఉషారాణి పాల్గొన్నారు.

ప్రచారమేదీ?

తడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్‌కు తగిన ప్రచారం జరగలేదు. పండుగ జరిగేప్రాంతాలలో ఇప్పటికీ గోడపత్రికలను సైతం ఏర్పాటు చేయకపోవడం విశేషం. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో మాత్రమే ఇంచుమించుగా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. భీములవారిపాళెం పడవలరేవులో ఇంకా ఏర్పాట్లు పూర్తికాలేదు. మరో వైపు అక్కడ రోడ్డు నిర్మాణం పర్యాటకులకు ఇబ్బందిగా మారే ఆస్కారం నెలకొంది. గతంలో సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూల్ ముందుగానే ప్రచారంలోకి తీసుకువచ్చేవారు. ప్రస్తుతం అటువంటివి ఏవీ అధికారులు విడుదల చేయలేదు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో భగవతి అనే మహిళ మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తుండగా గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆమె వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సూళ్లూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలీక్రాస్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రవీంద్రరెడ్డి, నెల్లూరు జిల్లా కలువాయికి చెందిన మస్తాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. ప్రొద్దూరుకు చెందిన రవీంద్రరెడ్డి తమిళనాడు తాంబరంలో ఓ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మోటరు సైకిల్‌పై స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో గుమ్మడిపూడి వద్ద మస్తాన్ లిఫ్ట్ అడిగి ఎక్కాడు. ఇద్దరూ మోటరు సైకిల్‌పై వస్తుండగా సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ వద్దకు చేరుకోగానే వెనుకనే వస్తున్న అపాచి పరిశ్రమ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. బస్సు ముందుభాగంలో మోటరు సైకిల్ ఇరుక్కుపోయి ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

ఓజిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కరబల్లవోలు గ్రామానికి చెందిన కూతల నాగేశ్వరరావుపై గురువారం అదే గ్రామానికి చెందిన సాలాపక్షి వెంకటేశ్వర్లుతోపాటు అతడి తండ్రి, భార్య దాడి చేశారు. సంఘటనలో నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఇటీవల ఎన్నికల వరకు ఒకే వర్గంగా ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో నాగేశ్వరరావు టీడీపీ, వెంకటేశ్వర్లు వైసీపీల సానుభూతి పరులుగా వేరుపడ్డారు. దీంతో వీరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. నాగేశ్వరరావు పనిమీద వెళ్లి వస్తుండగా వెంకటేశ్వర్లు సూరికత్తితో దాడిచేయగా.. అతడి తండ్రి, భార్య కూడా పాల్గొన్నారు. నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడటంతో చికిత్సకోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఓజిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపీనేత

బాలాయపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు గ్రామానికి చెందిన టీడీపీనేత, మండల రైతువిభాగం అధ్యక్షుడు ఆది వెంకటకృష్ణారెడ్డి గురువారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. లక్ష రూపాయలు నగదు చెల్లించి ఆయన టీడీపీ జీవితకాల సభ్యత్వాన్ని పొందారు. టీడీపీపై అభిమానంతో జీవితకాల సభ్యత్వాన్ని పొందినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు ఆటవిడుపుగా ఉండేలా క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. గురువారం మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, పోలీస్‌శాఖలు, న్యాయవాదులు, వాకర్లు, వైద్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

ఏరూరులోనూ...

చిల్లకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరులో చేవూరు చెంచురామయ్య జ్ఞాపకార్థం రామాసీతా వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో గురువారం ఏరూరు అల్లీపురం - ఏరూరు బలిజపాళెం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన అల్లీపురం జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బలిజపాళెం జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసి ఓటమిపాలైంది.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మానసను అభినందిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో స్థానం సంపాదించిన క్రీడాకారిణి మానసను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో పలాసలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో ఉమ్మడి నెల్లూరుజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మానస ప్రతిభచాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో మానస రాష్ట్ర జట్టు తరుపున పాల్గొననుండటం సంతోషకరమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్, కోటేశ్వరరావు, భాస్కర్, కరిముల్లాఖాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎమ్మెల్యే కురుగొండ్ల సోదరుడి మృతి

- కమ్మవారిపల్లిలో విషాదం



కురుగొండ్ల శేఖర్ (ఫైల్ ఫొటో)

డక్కిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోదరుడు కురుగొండ్ల శేఖర్ (53) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గుంటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా స్థిరపడ్డ శేఖర్ ఇంటి వద్ద రాత్రి భోజనం చేశాక ఛాతీలో నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస వదిలారు. సోదరుడు మృతి చెందాడన్న సమాచారం తెలుసుకొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజయవాడ నుంచి హుటాహుటిన గుంటూరుకు తరలివెళ్లారు. శేఖర్ స్వగ్రామమైన డక్కిలి మండలం కమ్మవారిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎన్నికల సమయంలో తన అన్న గెలుపుకోసం కష్టపడి పనిచేయడంతోపాటు ఇక్కడి జనంతో సన్నిహితంగా మెలగడంతో నియోజకవర్గ ప్రజలకు శేఖర్ సుపరిచితుడయ్యారు. ఆయన మరణ వార్త పలువురిని కలచివేసింది. శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు కమ్మవారిపల్లిలో అంత్యక్రియలు

కురుగొండ్ల శేఖర్ మృతదేహం శుక్రవారం ఉదయానికి కమ్మవారిపల్లికి చేరుకుంటుదని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని చెప్పారు.

హక్కుల కోసం ఉద్యమిద్దాం

కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలే శరణ్యమని.. ఇందుకోసం ఎంతటి త్యాగాలకైనా వెనుకడుగువేసే ప్రసక్తే లేదని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో గురువారం ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని బోధనేతర ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఇంజనీరింగ్ కళాశాల నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు జీతభత్యాలు, డీఏ, వార్షిక ఇంక్రిమెంట్‌లు, అలవెన్స్‌లు చెల్లించాలన్నారు. లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. హక్కులు, డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఏఐటీయుసీ, సీపీఐ నాయకులు రాధాకృష్ణ, కాలేషా, ప్రభాకర్, శశికుమార్, చంద్రబాబు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పక్షుల పండుగ

సూళ్లూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం నుంచి జరిగే పక్షుల పండుగ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్డీవో కిరణ్మయి అన్నారు. గురువారం ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పక్షుల పండుగకు జూనియర్ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మొత్తం 35 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్టాల్స్ ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అందరూ సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, తహశీల్దార్ నరసింహారావు, మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య, ఎంఈవో శ్రీనివాసులు, డీఎఫ్‌వో హారిక తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై సబ్‌కలెక్టర్ పరిశీలన



నేలపట్టులో అధికారులతో కలసి పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

దొరవారిసత్రం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శనివారం నుండి మూడు రోజుల పాటు జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను గురువారం నేలపట్టుపక్షుల కేంద్రంలో గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. పక్షుల కేంద్రంలో స్టాల్స్ ఏర్పాటుపై వేగంగా పనులు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వాహనాల పార్కింగ్ కోసం టూరిజం రిసార్ట్ స్థలాని ఉపయోగించేలా పనులు చేయాలని చెప్పారు. సందర్శకులకు నీటి వసతి, ఇతర సదుపాయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. నేలపట్టు ఈసీ కేంద్రం, చెక్ లిస్ట్ ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక తహసీల్దారు శైలాకుమారి, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, దొరవారిసత్రం ఎస్ఐ అజయ్‌కుమార్, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

గూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. తహసీల్దారు చంద్రశేఖర్, డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగించే సీపీఎం సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించడం హర్షనీయమన్నారు. జోగి శివకుమార్, శంకరయ్య, వెంకట్రామిరెడ్డి, మణి, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, సుధారాణి, వినీల పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం నిరంతర పోరాటం

- నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల కోసం నిరంతర పోరాటం చేస్తానని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం వెంకటగిరిలోని తన నివాసంలో నియోజకవర్గ స్థాయి వైసీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే అధికారపార్టీ నేతలు తనతో పాటు 11మందిపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. 2027లో జమిలీ ఎన్నికలు ఉంటాయని.. వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని.. మీరు చూపిన దారిలో మేమూ పయనిస్తామని హెచ్చరించారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న వైసీపీ మండల కన్వీనర్, పట్టణ కన్వీనర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు వహీదా, బాలాయ్య, లక్ష్మీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, రాజా రెడ్డి, యస్దానీ బాషా, ముళవాయి వెంకటేశ్వర్లు, యాతలూరు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పరిశీలన

వాకాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు శివాలయం వద్ద ఉన్న సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని గురువారం జడ్పీ సీఈవో విద్యారమా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో 19 గ్రామాలకు పైగా వాకాడు స్వర్ణముఖినది వద్ద ఉన్న సమగ్ర రక్షిత తాగునీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. నీళ్ల ట్యాంక్ నిచ్చెనకు రూ.5 లక్షల జడ్పీ నిధులు, చిట్టమూరు మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో కలిపి మరమ్మతు పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్‌కు సూచించారు. వాకాడు, చిట్టమూరు ఎంపీడీవోలు అన్నపూర్ణరావు, మనోహర్ గౌడ్, చిట్టమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం



కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో గురువారం గ్రామదేవత మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా కనుమ పండుగను పురస్కరించుకొని ఇక్కడ గాదే వారి కుటుంబం ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం పరిపాటి. మరో గ్రామదేవత అయిన కోటమ్మకు చెల్లెలుగా చెప్పుకునే మహాలక్ష్మమ్మను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో కోట పట్టణంలోని పలు వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఇరుగుళం కబడ్డీ విజేత బాలాజీకుప్పం

సత్యవేడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఇరుగుళంలో తిరువెంకట రామానుజ భక్తిసమాజం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీలలో పరిసర ప్రాంతాలతో పాటు సరిహద్దులోని తమిళనాడుకు చెందిన గ్రామాల నుంచి 52 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో తమిళనాడు రాష్ట్రం బాలాజీకుప్పం జట్టు విజేతగా నిలిచింది. వీరికి గ్రామానికి చెందిన జయ శంకర్‌రెడ్డి రూ.44,444లు ప్రథమ బహుమతిని అందించారు. ఇరుగుళం టీం రన్నర్‌గా నిలిచింది. వీరికి మాజీ సర్పంచ్ విశ్వమణిబాబు రూ.33,333లు రెండవ బహుమతిని అందించారు. ఆరంబాకం కుప్పం జట్టు మూడో స్థానంలో నిలిచింది. వీరికి గ్రామానికి చెందిన బీ.సురేందర్‌రెడ్డి రూ.22,222లు అందించారు. నాల్గవ స్థానంలో నిలిచిన సూళ్లూరుపేట మండలం వాంటబేడు కుప్పం జట్టుకు రామచంద్రాపురం మాజీ సర్పంచ్ బాలగురవం భాస్కర్ రూ.15,500లు బహుమతిగా అందించారు. సర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.


విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న జయశంకర్‌రెడ్డి

గిరి ప్రదక్షిణకు తరలిన దేవతామూర్తులు

నారాయణవనం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గురువారం నగరిలో కొండచుట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి మండలంలోని శివాలయాల నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసువెళ్లారు. నారాయణ వనంలోని చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి, సముదాయం గ్రామంలోని మరకతవల్లి సమేత అగస్తీశ్వరస్వామి, తుంబూరులోని తుంబీశ్వరస్వామిని, పాలమంగళం పాలేశ్వరస్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి నగరిలో జరిగే కొండచుట్టు ఉత్సవంలో పాల్గొన్నాయి.


పుర వీధులలో ఊరేగుతున్న మరకతవల్లి సమేత అగస్తీశ్వరస్వామి, చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి

సత్రవాడ ప్రవీణ్‌కు సత్కారం

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్‌ను పలువురు యువకులు ఘనంగా సత్కరించారు. సత్రవాడ ప్రవీణ్ యూత్ అసోసియేషన్‌లోని సభ్యులు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఉద్యోగాలు చేస్తుంటారు. ప్రతి ఏటా సంక్రాంతి రోజున వారి స్వగృహంలో యువత సమ్మేళనం నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాది గురువారం యువత కలుసుకుని సత్రవాడ ప్రవీణ్‌ను సత్కరించారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఏక్తా యాంటీ కరప్షన్ జాతీయ సహాయ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం వద్దనున్న వృద్ధులకు, సాధువులకు గురువారం ముస్లింలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాసిన్, అబ్దుల్ కలాం, అన్వర్ పాల్గొన్నారు.



ముక్కంటి సేవలో విశ్రాంత డీజీపీ

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం రాష్ట్ర విశ్రాంత డీజీపీ ఆర్‌పీ ఠాగూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధి కారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



వైభవంగా ఎల్లమ్మ కొండచుట్టు తిరుణాళ్ళు


ఎల్లమ్మ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి కొండచుట్టు తిరుణాళ్లను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కి అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని ఆలయ ముఖ మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి అశ్వవాహనంపై అధిష్ఠించారు. చంద్రగిరి మిట్టమీద గంగమ్మ, కోటలోని ముత్యాలమ్మ, చంద్రగిరి కొత్తపేటలోని అంకాలమ్మ, రాయలపురం మాతమ్మ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, వివిధ రకాల డప్పుల వాయిద్యాలు, కీలు గుర్రాలు, మైసూర్ బ్యాండ్స్, కోలాటాలు, చెక్కభజనలు, పిళ్ళంగట్లు, ఆటలతో అమ్మవార్ల ఊరేగింపు ప్రారంభమైంది. ఉత్సవాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హజరయ్యారు. అగరాల, కుప్పిరెడ్డిగారిపల్లె, పుల్లయ్యగారిపల్లె, పాండురంగయ్యగారిపల్లి. ఐతేపల్లి. కొటాల, నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లె మీదుగా శుక్రవారం తెల్లవారుజామున ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుంది. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా అమ్మవారికి టీటీడీ తరపున ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, కమిటీ సభ్యులు వెంకటముని, నాగరాజ, స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించాక ఆయన ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్ రెడ్డి దర్శించుకున్నారు.


అమ్మవారి ఊరేగింపులో వీపునకు కొక్కెం తగిలించుకుని వేలాడుతున్న భక్తుడు

పుత్తూరు వార్తలు

కిక్కిరిసిన అంజేరమ్మ కనుమ

వడమాలపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా శుక్రవారం స్థానిక అంజేరమ్మ కనుమకు భక్తులు పోటెత్తారు. గురువారం అంజేరమ్మ తల్లికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు వేలాదిగా అమ్మవారిని దర్శించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు.


విశేష అలంకరణలో అంజేరమ్మ

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన మేధో గురుదక్షిణా మూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకం చేశారు. తర్వాత విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నారా లోకేశ్‌ను కలిసిన గాలి మురళీ నాయుడు



శ్రీకాళహస్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) మంత్రి నారా లోకేశ్‌ను గురువారం తొట్టంబేడు మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు నారావారిపల్లెలో మర్యాద పూర్వకంగా కలిశారు. కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విజయ వాడలో పార్టీ కార్యాలయానికి రావాల్సిందిగా మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తల విజయ్‌కుమార్‌నాయుడు, నాని పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్‌రెడ్డికి సన్మానం



ఏర్పేడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పాపానాయుడు పేటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని గురువారం ఊరందూరులోని ఆయన స్వగృహంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవికుమార్, అర్జున్‌బాబు, సుబ్రహ్మణ్యం, దొరకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాటాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజరు చిట్టెమ్మ, యూనియన్ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో గల ఆర్‌సీపీ గురుకులంలో గురువారం 2001-02 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పాఠశాల యాజమాన్యాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురు వులు సత్యవతి, షేక్ మున్నవర్, సుబ్రహ్మణ్యం, పురుషోత్తం, మునిగోపాల్, పూర్వవిద్యార్థులు శివకుమార్ ఆచారి, నాసర్‌ఖాన్ పాల్గొన్నారు.

పిచ్చాటూరులో నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం పిచ్చాటూరులో పర్యటించనున్నారు. టీచర్స్ కాలనీ వద్ద ఉన్న బాలికల వసతి గృహ రహదారిలో చేపట్టనున్న సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రోత్సహిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా క్రీడలను విస్మరించిందన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అధ్వానంగా ఉన్న ఇండోర్ స్టేడియాన్ని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించడంతో పాటు నిధులు కేటాయించి బ్యాడ్మింటన్, యోగా మందిరం, వ్యాయామం చేసేందుకు మల్టీ పర్పస్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. క్రీడాకారులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కొంతసేపు బ్యాడ్మింటన్ ఆడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు

ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకుల పంపిణీ

వరదయ్యపాళెం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేద ముస్లిం మైనార్టీ ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఐ నూరుద్దీన్ సహకారంతో షేక్ అబ్దుల్ గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. మండలంలోని ముస్లింపాళెం, కడూరు, గోపాల్‌రావు కాలనీ, పద్మావతి పురం, గోవర్ధనపురం, లక్ష్మీపురంలోని 40 మంది ఆటో డ్రైవర్లకు మండల కేంద్రంలో 25కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రాజులపాళెంలో ఉచిత వైద్యశిబిరం


ఉచితంగా మందులను అందజేస్తున్న మేనేజరు చంద్రశేఖర్

ఏర్పేడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం రాజుల పాళెం గ్రామంలో గురువారం సీఎంఆర్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200మంది పేదలకు రూ.3 వేల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ అల్యూమినియం కంపెనీ హెచ్‌ఆర్ మేనేజరు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు జగదీష్‌నాయుడు, మురగయ్యనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలం గెలుపుపై పొంగళ్లు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా ఆదిమూలం గెలుపుపై జనసేన నాయకుడు కులశేఖర్‌రెడ్డి గ్రామదేవత చెల్లాతమ్మకు పొంగళ్లు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. మండలంలోని తొండూరు పంచాయతీ శ్రీహరికోట కాలనీలో గల జనసేన నాయకుడు కులశేఖర్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలుగా ఆదిమూలం, పవన్‌కల్యాణ్ గెలవాలని, చంద్రబాబు సీఎం కావాలని గ్రామదేవత చెల్లాతమ్మను మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో అమ్మవారికి గురువారం పొంగళ్లు సమర్పించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆహ్వానించారు. ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం

తొండూరు పంచాయతీలో రూ.15.75 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాజశేఖర్, ఎస్‌ఐ హరి ప్రసాద్, సర్పంచ్ రమణయ్య, టీడీపీ నాయకులు దశ, కరుణానిధి నాయుడు, ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి, బండారి జయ శంకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, జనసేన నాయ కులు చిరంజీవి యాదవ్, తులసీ, పృథ్వీ, పవన్, విక్కీ, వెంకటేష్, బాబు, పుట్టయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ట్యాంకు

కన్నుల పండువగా కొండ చుట్టు


ఊరేగింపుగా వస్తున్న లక్ష్మీవిలాసపురం స్వామి, అమ్మవార్లు

పిచ్చాటూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురం, లక్ష్మీవిలాసపురం, కొత్త గొల్లకండ్రిగ, వెంకటరెడ్డి కండ్రిగ, పాత గొల్లకండ్రిగ గ్రామాల్లో కొండ చుట్టు ఉత్సవాలు కన్నుల పండుగ నిర్వహించారు. తొలుత బొల్లితిప్పకొండలో వెలసిన చెల్లెమ్మ దేవతకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల రథాలను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన రాధ, రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామి చిత్రపటాలను ట్రాక్టర్లపై ఉంచారు. ఆయా రథాలు కొండ చుట్టూ తిరిగి ఊరేగింపుగా పులియంగుంట జడ్పీ హైస్కూలు మైదానానికి వచ్చాయి. బాగా అలంకరించిన రథాల నిర్వాహకులను సన్మానించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన చెప్పరాలను వాటి అలంకరణలను చూడ డానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఇస్రో విజయంపై శ్రీసిటీ అభినందనలు

శ్రీసిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సాధించిన డాకింగ్ స్పేస్ డాకింగ్ ప్రయోగం విజయ వంతం కావడం పట్ల ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వీ.నారాయణన్‌కు, ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఉపగ్రహాల అనుసంధానం (డాకింగ్) చేయగల సత్తా కలిగిన 4వ దేశంగా భారత్ నిలిచిందని పేర్కొంటూ ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషి, అంకితభావాన్ని కొనియాడారు. ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నారాయణన్‌కు అభినందనలు తెలిపిన రవీంద్ర సన్నారెడ్డి అంతరిక్ష పరిశోధనల పురోగతిలో భారతీయ శాస్త్రవేత్తల అసాధారణ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ స్పేస్ డాకింగ్‌లో ఇస్రో సాధించిన విజయం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఇస్రో అంకితభావాన్ని ప్రశంసిస్తూ వారి విజయ పరంపర నిరంతరం కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు.

నేటినుంచి మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా గిరిప్రదక్షిణ మార్గంలో ఉన్న అన్నపూర్ణ సమేత హరహరేశ్వరస్వామి ఆలయ మహా కుంభాభిషేకం శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి పది గంటల లోపు కుంభ లగ్నం నందు ఈ మహాకుంభాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

వేడుకగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

పిచ్చాటూరు, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని గోవర్ధన గిరి గ్రామంలో సం క్రాంతి సంద ర్భంగా శ్రీకృష్ణ భజన మందిరం ఆలయంలో గురువారం పార్వేట ఉత్సవాలు వైభవంగా నిర్వహిం చారు. రాత్రి రాధారుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని వివిధ రకాల పుష్పాలు, గజమాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. పండరి భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. ప్రజలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. గోవర్ధనగిరి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



నేటి నుంచి ఉచిత క్యాన్సర్ పరీక్షలు

నారాయణవనం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నారాయణవనం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నుంచి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ దర్శిత్ రాజ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం తుంబూరు, పాలమంగళం, జనవరి 20న అరణ్యం కండ్రిగ, కీళగరం, జనవరి 21న కాశిమిట్ట, వెంకటకృష్ణపాలెం, జనవరి 23న భీమునిచెరువు, నారాయణవనం-3, జనవరి 24న ఎరికంబట్టు, నారాయణవనం-2, జనవరి 27న కొండలచెరువు సచివాలయాల పరిధిలో శిబిరాలు జరుగుతాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామీణ క్రీడాకారులను అభివృద్ధి చేయడమే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని కాంపాళెం గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ జాతీయస్థాయి టోర్నమెంటును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. కాసేపు వాలీబాల్‌ను ఆడారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కాంపాళెం యూత్ ఇలాంటి పోటీలను నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు మునిచంద్రయ్య నాయుడు, దయా నాయుడు, రఘునాయుడు, వీరరాఘవులు, మునెయ్యనాయుడు, రవినాయుడు, కార్తీక్ నాయుడు, సురేష్ యాదవ్, భూపయ్య, రామనాథం, మనోహర్, నిర్వాహకుడు మునెయ్య, గోపి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం